సిద్దిపేటకు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డు

దక్షిణాదిన పరిశుభ్ర పట్టణం

- స్వచ్ఛత అవార్డు అందుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, కమిషనర్ సంపత్‌కుమార్
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, కమిషనర్ సంపత్ కుమార్

సిద్దిపేట, జనవరి 11: లక్ష జనాభా కలిగిన పట్టణాల్లో క్లీన్ సిటీకి ఇచ్చే అవార్డుల్లో సిద్దిపేట పట్టణానికి స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 అవార్డును గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు, కమిషనర్ సంపత్ కుమార్‌లకు ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో కేంద్ర అర్బన్ డెవలప్‌మెంట్ హౌసింగ్ సెక్రటరీ మనోజ్ జోషి అందజేశారు. అంతకు ముందు ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆవార్డును అందుకున్న సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సహకారంతో సిద్దిపేట పట్టణం నేడు జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రోనాల్డ్‌రాస్, ఆర్డీఎం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగింటి కనుకరాజు, అదనపు కమిషనర్ మల్లికార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్, వనిత,మాధవి, ఏఈ మహేశ్, ఎన్విరామెంటల్ ఇంజినీర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజల భాగస్వామ్యతోనే అవార్డు

ప్రజల సహకారంతో సిద్దిపేటను చెత్త రహిత పట్టణంగా రూపుదిద్దుకుంది. ప్రజల భాగస్వామ్యంతో సిద్దిపేట పేరు ఎల్లలు దాటింది. జాతీయ స్థాయిలో అవార్డులు రావడం సంతోషకరం. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో పాలకవర్గ సభ్యులు, అధికారుల పనితీరు అభినందనీయం.

– హరీశ్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

స్వచ్ఛతలో మెరిసిన దుబ్బాక

దుబ్బాక టౌన్, జనవరి 11: స్వచ్ఛసర్వేక్షణ్–2023లో దుబ్బాక మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో 478, రాష్ట్ర స్థాయిలో 18, జోన్ స్థాయిలో 8వ ర్యాంకు వచ్చినట్లు కమిషనర్ గణేశ్‌రెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మరింత స్వచ్ఛతగా తీర్చిదిద్ది మెరుగైన ర్యాంకును సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ర్యాంకు రావడానికి కృషి చేసిన మున్సిపల్ సిబ్బందిని, పారిశుద్ధ్య కార్మికులను కమిషనర్ అభినందించారు.

హుస్నాబాద్‌కు ముచ్చటగా మూడోసారి

హుస్నాబాద్‌టౌన్, జనవరి 11: స్వచ్ఛసర్వేక్షణ కార్యక్రమంలో భాగంగా దక్షిణాది రాష్ట్రాల్లో హుస్నాబాద్ మున్సిపాలిటీ క్లీన్ సిటీగా మూడో స్థానానికి ఎంపికైంది. ప్రతి ఏటా జాతీయ స్థాయిలో 'స్వచ్ఛసర్వేక్షణ' అవార్డులను కేంద్రప్రభుత్వం ప్రకటిస్తున్నది. ఇందులో భాగంగానే దక్షిణాదిరాష్ట్రాల్లో 15 వేల జనాభా నుంచి 25వేల జనాభా కలిగిన పట్టణాల్లో హుస్నాబాద్ మున్సిపాలిటీ క్లీనెస్ట్ సిటీగా గురువారం ఎంపిక చేశారు. మూడేండ్లుగా హుస్నాబాద్ మున్సిపాలిటీకి అవార్డులకు దక్కడం విశేషం.

మూడేండ్లుగా అవార్డులు

'స్వచ్ఛ సర్వేక్షణ'లో 2021కి శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంగా(ఫాస్టెస్ట్ మూవర్ సిటీ)గా హుస్నాబాద్ అవార్డుకు ఎంపికైంది. 2022లో సిటిజన్స్ ఫీడ్‌బ్యాక్ అవార్డుకు హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎంపికైంది. 2023 సంవత్సరానికిగానూ హుస్నాబాద్ మున్సిపాలిటీ క్లీనెస్ట్ సిటీగా ఎంపికైంది. అవార్డుకు ఎంపిక కావడంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, జనవరి 11: ప్రజా సమస్యలను వెలికితీసి వాటిని పరిష్కరించడంలో ప్రతి జర్నలిస్టు ముందుండాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మల్లారెడ్డి గార్డెన్‌లో గజ్వేల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విరాహత్ అలీకి నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గజ్వేల్‌లో 30 ఏండ్ల క్రితమే మేధావులతో కలిసి సంఘటితంగా ఏర్పాడి అనేక కార్యక్రమాలు చేపట్టిన చరిత్ర గజ్వేల్ జర్నలిస్టులకు ఉందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మహిళపై దాడులు, బాలకార్మికుల వ్యవస్థలపై పోరాటాలు చేసి అప్పట్లోనే ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి జర్నలిస్టులు ఎంతో కృషి చేశారన్నారు. ప్రజలకు మరింతగా సేవ చేసేలా రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కవి గాయకుడు జయరాజ్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దర్గా ఉత్సవాల్లో భక్తుల శోభాయాత్ర

భక్తి శ్రద్ధలతో ఉర్సు

సిద్దిపేట టౌన్, జనవరి 11 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సిద్దిపేట ముర్షద్ గడ్డ దర్గా ఉర్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఖాతా మహ్మద్ హకీం షరీఫ్ చాదర్ సమర్పించారు. రెండు తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులతో శోభయాత్ర నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మతపెద్దలు దర్గాలో ఖురాన్ పఠనం, కవ్వాలీ నిర్వాహించారు.

'కొమురవెల్లి' ఏఈవోను బదిలీ చేయాలి

రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు

చేర్యాల, జనవరి 11 : కొమురవెల్లి మల్లికార్జున ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్యను వెంటనే బదిలీ చేయాలని లేదా డిప్యుటేషన్‌పై ఇతర స్థానానికి పంపించాలని కోరుతూ గురువారం మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ డైరెక్టర్లు మధు సూదన్, కిరణ్ కుమార్, అంజయ్య యాదవ్ దేవాదాయశాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అంజయ్య డిగ్రీ సర్టిఫికెట్ ఫేక్‌గా నిరూపణ కావడంతో ఆయనను ఏఈవో నుంచి సూపరింటెండెంట్‌గా రివర్షన్ చేసినట్లు తెలిపారు. దేవాలయంలో పని చేస్తున్న కింది స్థాయి సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ జిల్లా నాయకుడు

వెంకటేశ్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, జనవరి 11 : బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి, మండలంలోని చుంచనకోటకు చెందిన వడ్లకొండ వెంకటేశ్ గౌడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే పల్లా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూటిపల్లి బుచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పండుగలపై అవగాహన కల్పించాలి

హుస్నాబాద్, జనవరి 11: తెలంగాణలో జరుపుకొనే పండుగల ప్రాధాన్యత, వాటి విశిష్టతలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ అయిలేని అనితారెడ్డి, వార్డు కౌన్సిలర్ కొంకటి నళినీదేవి, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

విద్యార్థినులు వేసిన ముగ్గులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకట్

దరఖాస్తుల ఎంట్రీపూర్తి

హుస్నాబాద్‌టౌన్, జనవరి 11: ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీ గురువారం పూర్తిచేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎంఆర్. రాజశేఖర్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని 20వార్డులో 6, 919 మంది ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారని, ఈ దరఖాస్తులను హుస్నాబాద్ మున్సిపల్‌కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాలలో ఆపరేటర్లు, వార్డు అధికారులతో కలిసి ఎంట్రీ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

గజ్వేల్‌అర్బన్, జనవరి11: మోడల్ స్కూల్ 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని గజ్వేల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్ మోడల్ పాఠశాలలోని 6వ తరగతిలో 100, 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు గల ఖాళీసీట్ల విద్యార్థుల ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. 12తేదీ నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హాల్ టికెట్ ఒకటవ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు మోడల్ స్కూల్ వెబ్‌సైట్ http://telanganams.cgg.gov.in/లో సంప్రదించాలని సూచించారు.

గంజాయి సరఫరా చేస్తే జైలుకే..

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 11: గంజాయి, మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తే, కేసు నమోదు చేసి జైలుకే పంపనున్నట్లు హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ అన్నారు. గురువారం మద్దూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. గంజాయి వంటి మత్తు పదర్థాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు ముందోస్తుగా సమాచారం అందించాలని సూచించారు. పిల్లలు పతంగులను ఎగురవేసే సమయంలో ప్రమాదాలు జరుగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బెల్టుషాపులను మూసివేయించాలి

హుస్నాబాద్, జనవరి 11: బెల్టుషాపులు పచ్చని పల్లెల్లో చిచ్చు పెడుతున్నాయని, వీటిని వెంటనే మూసివేయించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం హుస్నాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 300లకు పైగా బెల్టుషాపులు నడుస్తున్నాయని, వీటిని నియంత్రించడంలో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు అనంతస్వామి, రాజేందర్, మోర రవి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 11: ధూళిమిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను మద్దూరు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింహారెడ్డి, హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ సీహెచ్ రాజు, ఎస్టీయూ ధూళిమిట్ట మండల అధ్యక్ష–ప్రధాన కార్యదర్శులు జంగిటి శ్రీనివాస్, పన్నీరు రాజు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

సిద్దిపేట కమాన్, జనవరి 11 : సిద్దిపేట పట్టణానికి చెందిన అనూష హైదరాబాద్‌లో చదువుకుంటుంది. సంక్రాంతి సెలవులు రావడంతో గురువారం హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు బయలుదేరింది. సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సమయంలో సెల్‌ఫోన్ పోయింది. బస్సు దిగిన అనూషకు సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో ఆమె తండ్రి సహకారంతో సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌లోని ఎంక్వైరీ కౌంటర్ వద్ద సమాచారం ఇచ్చారు. డ్రైవర్ బాలకిషన్ బస్సులో వెతకగా ఫోన్ లభించింది. డిపో అసిస్టెంట్ మేనేజర్ మల్లీశ్వరీ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్‌ను అనూషకు అందజేశారు. డ్రైవర్ బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్, ఉద్యోగులు డ్రైవర్ బాలకిషన్‌ను అభినందించారు.

'హిట్ అండ్ రన్' కేసును రద్దు చేయాలి

గజ్వేల్, జనవరి 11: రవాణా రంగంలో పని చేస్తున్న డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడేసే విధంగా పార్లమెంట్‌లో హోంశాఖ మంత్రి అమిత్‌షా పెట్టిన బిల్లు 'న్యాయ సంహిత హిట్ అండ్ రన్' కేసును రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎల్లయ్య అన్నారు. గురువారం ప్రజ్ఞాపూర్ రాజీవ్‌రాహదారిపై నిరసన తెలిపారు. డ్రైవర్లకు భద్రత కల్పించాలన్నారు. ఆయన వెంట రమేశ్, వెంకటేశ్, బాల్‌రాజు, రాజు, రాములు ఉన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట అర్బన్, జనవరి 11 : జిల్లాలో ఈ చలాన్ పెండింగ్‌లో ఉన్న వాహనదారులకు 31తేదీ వరకు ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురువారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. ద్విచక్ర వాహనాలకు 80 శాతం, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, తోపుడు బండ్లకు 90 శాతం, నాలుగు చక్రాల వాహనాలు, లారీలు, భారీ వాహనాలకు 60 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.

వినికిడి సమస్య ఉన్న వారికి ఉచిత క్యాంప్

సిద్దిపేట అర్బన్, జనవరి 11: ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా గురువారం సిద్దిపేట పట్టణంలోని టీటీసీ భవన్‌లో వినికిడి సమస్య ఉన్న దివ్యాంగులకు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో ఉచిత క్యాంప్ నిర్వహించి అర్హులను గుర్తించినట్లు కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్ తెలిపారు. మొత్తం 66 మందిని పరీక్షించగా.. 34 మంది అర్హులుగా గుర్తించామన్నారు. వారందరికీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా హియరింగ్ కిట్స్ అందజేస్తామని తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

తొగుట జనవరి 11 : దేశంలో కార్మికుల పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని తొగుట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కార్మికులకు కనీస వేతనాలు నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తు న ఆందోళ చేపడుతామన్నారు. కార్మికులు శంకర్, భాగ్యలక్ష్మి, ప్రవీణ, స్వ రూప, మహేశ్వరి,లక్ష్మి, స్వామి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

చిన్నకోడూరు, జనవరి 11 : చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 150 మంది విద్యార్థినులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ విజయ కుమార్ తెలిపారు. హిందుస్థాన్ కోకో–కోలా బేవరేజెస్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి మెకానికల్, ఎలక్ట్రికల్, మెకానిక్స్, మెకాట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్‌లో ఉద్యోగం పొందుతారన్నారు. ఏడాదికి రూ. 3,50,000 వేతనం వస్తుందన్నారు.

గ్రాండ్‌గా ఫుడ్ ఫెస్టివల్

మిరుదొడ్డి మోడల్ పాఠశాలలో విద్యార్థుల వంటకాలను పరిశీలిస్తున్న కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, జనవరి 11 : ఉపాధ్యాయులు చదువుతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించడం సంతోషంగా ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మిరుదొడ్డి టౌన్‌లోని తెలంగాణ మోడల్ పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఫుడ్ ఫెస్టివెల్‌ను నిర్వహించారు. విద్యార్థులు 150 రకాల వంటకాలను స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. ఈకార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ప్రిన్సిపాల్ భారతి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, గణేశ్, పాల్గొన్నారు.

పామాయిల్ కర్మాగారం పనుల పరిశీలన

నంగునూరు, జనవరి 11 : మండల పరిధిలోని నర్మేటలో నిర్మితమవుతున్న ఆయిల్ శుద్ధి కర్మాగారం పనులను గురువారం రాష్ట్ర ఆయిల్‌పామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు కృషితో రూ.300 కోట్లతో 62 ఎకరాల్లో కర్మాగారం నిర్మాణం జరుగుతుందన్నారు. నర్మెట ఆయిల్‌పామ్ కర్మాగారంపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, పరశురాములు ఉన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం

దుబ్బాకలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి

దుబ్బాక, జనవరి 11 : మచ్చలేని నాయకుడు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తే సహించబోమని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి హెచ్చరించారు. గురువారం దుబ్బాకలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక పీఏసీఎస్ అవినీతిపై కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని సూచించారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. నాయకులు మోహన్‌రెడ్డి, రామ్‌జీ, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

రాజకీయం తగదు..

దుబ్బాక, జనవరి 11 : దుబ్బాక పీఏసీఎస్‌లో జరిగిన అవినీతిపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్ మండిపడ్డారు. గురువారం దుబ్బాక పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు వేర్వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్ కాల్వ నరేశ్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డైరెక్టర్లు గజబింకార్ బాలరాజు, యాదగిరి ఉన్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

బెజ్జంకి, జనవరి 11 : మండలంలోని పాపయ్యపల్లి చెందిన లోనే రాజేందర్, రాధ గ్రామశివారులోని వ్యవసాయ బావి దగ్గర పనులు చేస్తుండగా తేనే టీగలు దాడి చేశాయి. దీంతో వారిని మొదట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, మెరుగైన చికిత్సకోసం సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

కొండపాక ఫొటోగ్రాఫర్ల నూతన కార్యవర్గం

కొండపాక, జనవరి 11 : కొండపాక మండలం ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడిగా నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, కోశాధికారిగా కృష్ణ, సలహాదారులుగా సంజీవ్, సురేందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సిరిసినగండ్ల విద్యార్థినికి సాహిత్య పురస్కారం

ఐశ్వర్య

కొండపాక, జనవరి 11 : మండలంలోని సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పుల్ల ఐశ్వర్యకు సాహిత్య పురస్కారం వరించింది. గురువారం హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాలసాహిత్య పీఠం ప్రకటించిన బాలసాయిత్య పురస్కారానికి విద్యార్థిని ఐశ్వర్య ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది విఠల్ తెలిపారు. ఆమె రాసిన 'తేనే టీగసాయం' అనే కథకు పురస్కారం లభించిందని వచ్చే నెల హైదరాబాద్‌లోని రవీంద్రబారతిలో పురస్కారం అందజేస్తారని తెలిపారు. విద్యార్థిని ఐశర్యను ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు రుత్విక్ ఎంపిక


రోళ్ల రుత్విక్

సిద్దిపేట, జనవరి 11 : ఈనెల 16 నుంచి 23 వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరుగనున్న అండర్–17 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు సిద్దిపేటకు చెందిన రోళ్ల రుత్విక్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సోమశేఖర్, క్రికెట్ కోచ్ ప్రదీప్ మాట్లాడుతూ సిద్దిపేటకు చెందిన రోళ్ల రుత్విక్ గత డిసెంబర్‌లో గద్వాలలో హైదరాబాద్ జిల్లా జట్టుకు ఆడటంతో పాటు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడన్నారు. ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసి తెలంగాణ జట్టుకు ఎంపిక కావడంపై రుత్విక్‌ను అభినందించారు.

యువజనోత్సవాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి


యువజనోత్సవాలకు ఎంపికైన డేవిడ్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట టౌన్, జనవరి 11 : మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకు జరిగే యువజనోత్సవాలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి డేవిడ్ ఎంపికయ్యాడు. దేశవ్యాప్తంగా జరిగే ఉత్సవాలకు కళాశాల విద్యార్థి ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. డేవిడ్‌ను కళాశాల అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

అవినీతిపై ఫిర్యాదు చేశాం

దుబ్బాకలో మాట్లాడుతున్న చైర్మన్ కైలాస్, పక్కన డైరెక్టర్లు

దుబ్బాక, జనవరి 11 : దుబ్బాక పీఏసీఎస్‌లో అవినీతి, అక్రమాలపై తామే స్వయంగా డీసీవోకు ఫిర్యాదు చేశామని, దానిపై ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్ అన్నారు. గురువారం దుబ్బాక పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక పీఏసీఎస్‌లో సీఈవో లక్ష్మారెడ్డి సుమారు రూ.40 లక్షలు అవినీతికి పాల్పడ్డారని, దీనిపై రెండేండ్ల కిందట డీసీవోకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తాను చైర్మన్‌గా ఎన్నికకు ముందుగానే ఇందులో అవినీతి జరిగినట్లు ఆధారాలతో డీసీవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఆసమయంలో దుబ్బాక ఎమ్మెల్యేగా బీజేపీకి చెందిన రఘునందన్‌రావు ఉన్నారని, ఆయన దీనిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇప్పుడు తనపై రాజకీయ కక్ష సాధింపుకోసమే అవినీతి అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జిగా చెప్పుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డికి అవగాహన లేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కాంగ్రెస్, బీజేపీ నాయకులు నిజాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. డైరెక్టర్లు గుండెల్లి ఎల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, రామ్‌జీ, బోయ యాదగిరి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న జడ్పీటీసీ కొండల్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 11: శారీరక ధారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని మద్దూరు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం ధూళిమిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ పోటీలను జడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతల జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పం చ్ దుబ్బుడు దీపికా వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈవో నర్సింహారెడ్డి, హెచ్‌ఎం కరుణాకర్ రెడ్డి, పీడీ దామెర ప్రేమ్ కుమార్, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, నాయకులు జెల్ల శ్రీనివాస్, కొలిపాక భూపతి, తదితరులు పాల్గొన్నారు.

'వికసిత భారత్' వైపు అడుగులు వేద్దాం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

వర్గల్, జనవరి 11: భారత్ రానున్న రోజుల్లో ప్రపంచంలోనే పెద్ద ఆర్థికశక్తిగా ఎదుగుతుందని ఇందు కోసం 2047 విజన్ దిశగా వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్య వాణిజ్య రంగాల్లో పురోగమిస్తూ వికసిత భారత్‌యాత్రను చేపట్టామని కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రెటరీ అజయ్‌గుప్తా వెల్లడించారు. గురువారం వర్గల్ మండలం చౌదర్‌పల్లిలో 'భారత్ వికసిత సంకల్పయాత్ర' నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ విధానంలో జరిగే మార్పులపై గ్రామ రైతులతో చర్చించారు. అనంతరం గ్రామానికి చెందిన ఓ రైతు సాగుచేస్తున్న మొక్కజొన్న సాగులో డ్రోన్ యంత్రపరికరం ద్వారా పంటపొలాలకు మందులు పిచికారీ చేసే విధానంపై ప్రయోగాత్మకంగా ప్రదర్శించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఉమ్మడి జిల్లా రీజనల్ మేనేజర్ అరుణ్‌జ్యోతి, ఏపీడీవో కౌసల్యాదేవి, డీఆర్డీవో జయదేవ్, డీఎంహెచ్‌వో కాశీనాథ్, వర్గల్ ఎస్‌బీఐ మేనేజర్ సాయికిరణ్, ఎల్‌డీఎం సత్యజిత్, తదితరులు పాల్గొన్నారు.